# అసమర్థులు



## సేతుమాధవరావు

**ఆశయాలను పట్టి వేలాడితే ఈ రోజుల్లో అసమర్థులు అంటారు. వచ్చిన అవకాశాలను చేజిక్కించుకుని, సమాజంలో పైపైకి ఎగబ్రాకితే గొప్పవాడు అంటారు. నీతికి, నిజాయితీకి, ఆత్మీయతలకు వ్యక్తి చెప్పిన నాడే రాణింపు గుర్తింపుకు వస్తుంది.**

నీరసంగా కుర్చీలో కూలబడ్డాను.

చికాగ్గా ఉంది. ఎవరిమీదనో ఉక్రోషం ముంచుకొస్తున్నది.

ఎన్నో సంవత్సరాలక్రితం చచ్చిపోయిన అమ్మమ్మ మాటలు గుండెల్లో గుడ్డి దీపంలా మిణుకు మిణుకు మంటున్నాయి.

"ఒరేయ్, పిచ్చి వెధవా! నీలాంటివాళ్లేం బ్రతుకుతార్రా ఈ లోకంలో!"

నాకు తెలుసు, నేను దురదృష్ట జాతకుడినని.

అందుకే విధితో, తలవ్రాతతో పోటీపడి నెగ్గాలన్న పట్టుదల నాకు లేదు.

ఎదురుగా పడి ఉంది ఉత్తరం.

నాకు తెలుసు, అలా జరుగుతుందని.

అదృష్టం మరీ రాక రాక వస్తుందా!

అందుకే అందరితోనూ చెప్తాను, విధి ఎలా వ్రాసి ఉంటె అలా జరుగుతుందని.

కాని, అందరూ పెదవి విరిచేవాళ్లే. అసమర్థుడివి నువ్వేనని వేలెత్తి చూపేవాళ్లే!

ఎవరో ఎందుకు? దాదాపు ఇరవై సంవత్సరాలుగా నే నంటే ఏమిటో, నేనెవరో తెలిసిన నా అర్ధాంగి నన్నే అంటుంది.

సమర్థత ఉంటే విధిని మన కనుకూలంగా తిప్పుకోవచ్చుట!

ఎవరి పిచ్చి వాళ్ళ కానందం!

నేను కష్టపడి ఇంటర్ చదివిన రోజులు నాకు బాగా గుర్తు. మరచి పోదామన్నా మరపు రావడం లేదు ఆ రోజులు.

క్లాస్ రావాలని, డాక్టరీ చదవాలని ఎన్ని కలలు కన్నాను!

నా డైరీ అబద్ధం చెప్పదు!

ఎంతో కష్టపడి, ఆరోగ్యం చెడ గొట్టుకొని అమ్మమ్మ భాషలో 'పుల్ల'లా తయారై చదివితే నాకు దక్కిం దేమిటి?

నేను పరీక్ష తప్పాను.

కనీసం పాసయ్యే యోగ్యత నాకు లేకపోయింది.

"ఎంత చదివితే మాత్ర మేం? బుర్రకెక్కితేగా!" అన్నారు కొందరు.

"సంవత్సరమంతా బాధ్యతా రహితంగా తిరిగి ఆఖరిని ఏది రోజులు పుస్తకాలు ముందేసుకుంటే వస్తుందా చదువు?" అన్నారు మరికొందరు.

అమ్మమ్మ ఒక్కతె మాత్రం, "తల వ్రాత ఉండాలా దేనికైనా!" అంది.

అప్పుడూ నేను అసమర్థుడినే!

ఇంటర్ పూర్తిచేసి బి. ఏ. చదువుదా మనుకున్నాను.

నాన్న ఏమన్నాడు?

ఇంక చదివించలే నన్నాడు. ఇంటి పరిస్థితులు ఏమీ బాగులే వన్నాడు. నేను చేదోడైతే చాలుట ఆయనకి!

నాన్నతో పోట్లాడక, ఆయన్ని అర్థం చేసుకుని, అలాగే నడిచినందుకు ఈ లోకం దృష్టిలో నేను అసమర్థుడిని.

మనస్సు పీకుతున్నా, ఇష్టం లేకున్నా నాన్న చెప్పినట్టు పెళ్ళి చేసుకున్నాను.

పెళ్ళిమీద స్నేహితులలో ఏర్పరుచుకున్న అభిప్రాయాలు, ఆశయాలు మట్టిలో కొట్టుకుపోయాయి!

ఈ రోజు పెద్ద పెద్ద వాళ్ళని పట్టుకొని కూతురి పెళ్ళి చెయ్యాలి.

నేను చేస్తున్న మాస్టారు ఉద్యోగానికి నాకు పెద్ద పెద్ద వాళ్ళంతా స్నేహితులు కావాలిట!

నే నెన్ని ప్రయత్నాలు చెయ్యడం లేదు! పెళ్ళంటే మాటలా?

సంసారం లాగడమే కష్టంగా ఉంటే ఇక కట్నం ఎక్కడ తేను? ఏదో చెయ్యాలి మరి. చేస్తానుకూడా.

దేనికైనా సమయం రావాలి మరి.

నేనే అసమర్థుడిని, చేతకాని దద్దమ్మనే అయితే .... నాలాగ ... మాస్టారు ఉద్యోగం వెలగబెడుతూ, నాలాగ బ్రతుకుతున్న వేనకు వేల మంది అందరూ చేతగాని అసమర్థులే అంటాను అయితే.

రెండు నెలల క్రితం సుందరం కనపడ్డాడు నాకు. ఏదో బాంకులో పెద్ద ఆఫీసరు వాడు. ఇంటర్‌లో కలిసి చదువుకున్నాం.

"చాలా మారిపోయావు!" అన్నాడు నావైపు చూసి.

"అవును! పెద్దవాళ్ళయ్యాం కదూ!" అన్నాను.

పెద్దగా నవ్వాడు.

అంత నవ్వవలసిన మాట ఏమన్నానో నాకే అర్థం కాలేదు.

"అలాగా! నిజంగా అంత పెద్ద వాళ్ళ మయ్యామా? నా కింకా మనం ఇంటర్ చదవడం నిన్న మొన్న జరిగి నట్టుంది!" అన్నాడు కోటు కాలరు సరిచేసుకుంటూ.

నిజమే, సుందర్‌లో అంత వయసు కనిపించడం లేదు. ఏకూ చింతా లేని ఆఫీసరు మరి.

"నువ్వు అదృష్టవంతుడివి!"

"అలాగేం! ఎంతమంది పిల్లలు నీకు?"

"ఎనిమిది మంది. ఆరుగురు ఆడపిల్లలు. ఇద్దరు చిన్నవాళ్ళా మగ పిల్లలు" అన్నాను నవ్వి.

మళ్ళీ నవ్వాడు గట్టిగా.

"నీ ముఖంలో ఇన్ని ముడతలు పడటానికి కారణం ఇప్పుడు తెలిసింది!" అన్నాడు అలాగే నవ్వుతూ.

"నన్ను దెప్పనక్కరలేదు. నీ సంగతి చెప్పు."

"ముగ్గురు. ఆఖరిది ఆడపిల్ల. పెద్దవాడు ఎమ్. ఎస్‌సి. అగ్రికల్చర్ చేస్తున్నాడు. సిగరెట్టు తాగుతావా?"

"వద్దు. అలవాటు లేదు"అన్నాను.

"అదేమిటి? ఇంటర్‌లో తెగ తాగే వాడివి. మరిచిపోయావా?"

"అవును, మరిచిపోయాను. ఆ రోజులు ఎప్పుడో మరిచిపోయాను!"

మళ్ళీ నవ్వాడు ఇల్లు ఎగిరిపోయేట్టు.

"థాంక్ గాడ్! నన్ను కూడా మరిచిపోలేదు. ఒక్కటి చెబుతాను, విను. ఇలాంటివి మానవుడు ఎందుకు సృష్టించాడో తెలుసా? ఆనందంకోసం. సృష్టించుకున్న ఆనందం అనుభవించడం మన కర్తవ్యం!"

"నా కర్తవ్యం నాకు తెలుసు, సుందరం! నేనూ ఆనందంతో, తృప్తితో బ్రతుకుతున్నాను. ప్రతి మనిషీ తన పరిధికి తగినట్లు ఓ జీవితాన్ని ఎంజాయ్ చేస్తాడన్నది నీకు తెలీదు!"

"ఏమిట్రా ఎంజాయ్ చెయ్యడం! చాలీచాలని జీతం ... ఆరుమంది ఆడపిల్లలకి పెళ్ళి ఎలా చెయ్యాలన్న దిగులు ... ఏమిట్రా ఆ ఎంజాయ్‌మెంటు?"

కొంతసేపు మౌనంగా కూర్చున్నాం. సుందరంతో ఏదో చెప్పి ఒప్పించా లనిపిస్తూంది.

"సుందరం! నువ్వూ, నేనూ ప్రాణ మిత్రులం! అంతమాత్రాన ఒకళ్లని ఒకళ్ళు అవమానించుకోవాలా? నా జీవితం ఇలా సాగిపోవాలని వ్రాసి ఉంది. అందుకే ఇలా ఉన్నాను. నువ్వు బ్రతుకుతున్న బ్రతుక్కి సిగరెట్లు త్రాగడం, సూటు వేసుకోవడంలాంటివి ఎంజాయ్‌మెంట్స్. నా బ్రతుక్కి నాకూ కొన్ని వందల మంది పిల్లలకి చదువు చెబుతున్నాననే తృప్తీ, ఆనందం ఉన్నాయి. ఆదే నా ఎంజాయ్‌మెంటు.



చిత్రం—మునగపాటి రామకృష్ణ (హైదరాబాదు)

ఏదో ఆనందం ప్రతి మనిషీ వెతుక్కుంటాడు, తెలుసా? రోజుకి ఒక్క క్షణమైనా మనం ఆనందం అనుభవిస్తాం. తృప్తితో గాలి పీలుస్తాం! ఇదే నిజం కాకపోతే ప్రపంచంలో మానవ జాతి అంతా ఆత్మహత్య చేసుకొనేదే ఏనాడో! జీవితానికి నిర్వచనం ఒక్కొక్కళ్ళు ఒక్కో విధంగా చెప్పుకుంటార్రా!"

"క్షమించు, చలపతీ! సుందరం నిన్ను అవమానిస్తాడా! ఏమిటో నీ వేదాంతం! ఈ వేదాంతం కడుపు నింపదురా!"

"అలాగే అనుకో! ఇప్పుడు నా విధి వ్రాత నే నెలా తప్పించుకోగలనో చూడుమరి! నీ కొడుక్కి నా కూతురిని చేసుకో! కానీ కట్నం కూడా ఇవ్వలేను మరి!" అన్నాను నవ్వి.

సుందరం ముఖం నల్లబడింది.

"నిజమేరా! ఇది నేను చెయ్యలే నేమో! సైకలాజికల్‌గా నాకూ కొన్ని బాధలు ఉన్నాయి. ఇప్పటికే ఆలస్యమై పోయింది. వాడు నా మాట వినడు!" అన్నాడు నిట్టూరుస్తూ.

నిజం చెప్పాలంటే సుందరంతో గడిపిన రెండు రోజులూ ఆనందంగా గడిచాయి. కల్మషంలేని కాలేజీ రోజులు తవ్వుకున్నాం ఇద్దరమూ.

రైలెక్కిన తరవాత సుందరం చాలా బాధపడ్డాడు.

"చలపతీ! నే నన్న మాటలు మనస్సులో పెట్టుకోకు! నే నెవరిని? నీ ప్రాణ స్నేహితుడిని కదరా!" గట్టిగా నవ్వాడు.

రైలు కదులుతూండగా అన్నాడు నిట్టూర్చి:

"నీది ఆత్మవంచన లేని బ్రతుకు! కానీ, నేను ఆత్మవంచన లేకుండా ఒక్క రోజు కూడా గడపలేను!"

సుందరం కళ్లలో తడి కనిపించింది నాకు. రైలు వెళ్ళిపోయింది.

ఎంత అర్థంచేసుకున్నా సుందరం కూడా నన్ను అసమర్థుడి క్రిందే లెక్కేశాడు.



విడుగుతున్న వెలుగు

ఫోటో — వి. పాండురంగారావు (నెల్లూరు)

తల బరువుగా ఉంది.

ఎదురుగా రామ్మూర్తి వ్రాసిన ఉత్తరం.

ఉత్తరం విప్పి మళ్ళీ చదివాను. చదివినదే చదవడం, చెప్పినదే చెప్పడం ఎన్నో సంవత్సరాల అలవాటు.

రామ్మూర్తి నా ప్రాణ స్నేహితుడు. సుందరం ఎంతో, రామూ కూడా అంతే నాకు.

"డియర్ చలపతీ!

ఆలస్యంగా ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. అంతేకాదు, అగ్నికణంలా నీపై విసురుతున్నాను.

ఇన్నాళ్లకు లోకం నా కిచ్చిన బిరుదు పోయేట్టుంది అని నువ్వు వ్రాశావు. నీకు ఆశలు కల్పించిన మాట నిజమే. అందుకు నామీద నాకే కోపం ఉంది. ఏం చెయ్యమంటావ్, చలపతీ? నీ తల వ్రాత సిద్ధాంతం పూర్తిగా నిజమని ఈ రోజు ఒప్పుకుంటున్నాను. మనం కాలేజీలో చదువుకునే రోజులలో పెట్టుకున్న ఆశలు, ఆదర్శాలు గాలిలో కలిసిపోయి, నీ వొక బడిపంతులుగా, నే నొక పనికిరాని లాయరుగా మిగిలిపోతే మనం ఏమనుకున్నాం? ఇదంతా తలవ్రాత కాదూ? నా కిప్పుడు యాభై ఏళ్ళు. నీకూ అంతే. ఒక్కసారి ముప్ఫై ఏళ్ళు వెనక్కి గతంలో తొంగి చూడు, నీకే తెలుస్తుంది మన ఆదర్శాల్ని మనం కాళ్ళతో ఎలా తొక్కివేశామో! అంతే, బ్రదర్! ఈ జీవితం అంతే!

ఇన్నాళ్ళూ ఒప్పుకొని ఇప్పు డేమంటాడో తెలుసా? వాడి స్నేహితు డో పెద్ద ధనవంతుడట. వాడి చెల్లెల్ని చేసుకుంటాడట.

'అదేమిట్రా మాట ఇచ్చాం కదా!' అని నేనంటే...

'ఆఁ మనమేం ఆడి తప్పని హరిశ్చంద్రులమా! అయినా, నువ్వు చెప్పు, నాన్నా, నేను డాక్టర్ని కదా? ఆ అమ్మాయిని చేసుకుంటే పది వేలు కట్నమేకాక ఫారిన్‌కి పంపే ప్రయత్నాలు చేస్తాడట వాళ్ల నాన్న. ఈ అవకాశం వదులుకో మంటావా? ఎలా, నాన్నా? వాడు నాకు ప్రాణస్నేహితుడు. మాటిచ్చాను!' అన్నాడు.

'అయితే నా మాటేం చేస్తావురా?' అన్నాను.

'ఎలాగో అవస్థపడు! అయినా,నువ్వు నన్ను విదేశాలకి పంపించగలవా, నాన్నా? అది కనీసం ఈ విధంగా అయినా సాధ్యమవుతుంటే నీకు సంతోషంగా లేదా, చెప్పు? మామూలు మనిషిగా నాకూ కోర్కెలు ఉన్నాయి. నే నేం మానవాతీతుడిని కాను. అవకాశవాదులకే ఈ లోకంలో మంచి బ్రతుకు!' అన్నాడు.

ఇదీ, చలపతీ, జరిగిన సంగతి. ఏదీ దాచలేదు. చూశావా? డాక్టరీ చదివిన ఈ నవ యువకుడు కట్నం తీసుకుని, మామగారి డబ్బుతో విదేశాలు వెళతాడట! ఆఖరికి నా కొడుకు నాకు అవకాశవాదికే బ్రతుకు అని బోధించే స్థితి వచ్చింది.

అందుకే, చలపతీ, మనం ఇద్దరం అసమర్థులమే అంటాను. ఈ మాట మన కళ్లముందు పుట్టి పెరిగినవాళ్ళు కూడా అంటున్నారు. ఇందులో ఆశ్చర్యం లేదు. కాలం ముందుకి వెళ్లిపోతున్నా మనం వెనకనే కూర్చున్నాం. ఇలాగే ఉండిపోతాం ఎన్నాళ్లయినా!

చలపతీ! నన్ను మనఃస్ఫూర్తిగా క్షమించు. ఈ ఉత్తరం నీకు చేరే రోజు ... అంటే పదవ తేదీ...మా ఊరిపైగా తిరుపతి వెళుతున్నాను. నన్ను క్షమించి బస్‌స్టాండుకి రా! చెప్పవలసినది ఇంకా చాలా ఉంది.

— నీ, రామ్మూర్తి."

బస్సు వచ్చే వేళ అయింది.

ఉత్తరం అక్కడ పడేసి, లేచి కండువా సరిగా వేసుకుని బస్‌స్టాండు వైపు త్వరత్వరగా అడుగులు వేశాను. ★